క్లుప్తంగా

కాలనీల్లో సమస్యలు పరిష్కరించండి

కల్లూరు : కల్లూరు అర్బన్ 33వ వార్డులోని జానకి నగర్, హేమలత నగర్, ఇందిరమ్మ కట్ట పరిసర ప్రాంతాలలో డ్రైనేజీ కాలువలు పూడిక, చెత్త చెదారంతో నిండి ఉన్నాయని సీపీఎం నాయకులు సుధాకరప్ప, శ్రీనివాసులు అన్నారు. బుధవారం సీపీఎం ప్రతినిధుల బృందం 33వ వార్డులోని పలు కాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడి కాలనీలలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ కల్లూరు శ్మశానవాటికలో కంపచెట్లు పెరిగి అస్తవ్యస్తంగా ఉందన్నారు. శ్మశాన వాటికకు హంద్రీనది వెంట కాంఫౌండ్ వాల్ పడిపోయి సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని కంపచెట్లను తొలగించి, నీటి వసతి కల్పించి, రాత్రిపూట లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హుస్సేన్ బాష, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎంపీడీఓ సమీక్ష

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో ఎంపీడీఓ రాణెమ్మ వ్యవసాయ, వెలుగు, ఉపాధి హామీ అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు జన సమీకరణపై చర్చించారు. కాగా మండలానికి 120 నుంచి 150 మధ్యలో బస్సులను కేటాయించారని, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పొదుపు మహిళలు, రైతులు, ఉపాధిహామీ కూలీలను బస్సులలో ఎక్కించుకుని సభకు తీసుకరావాలని సూచించారు. వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఏపీఓ రామన్న, ఏఈఓ హిమబిందు, మండల పరిషత్ పరిపాలన అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



వైఎస్సార్‌సీపీ నేత జయరాంకు నివాళులర్పిస్తున్న కోట్ల హర్ష, డా. సతీష్

కోడుమూరు రూరల్ : కర్నూలు మండలంలోని ఈ.తాండ్రపాడు గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత జయరాం మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ బుధవారం ఈ.తాండ్రపాడు గ్రామానికి చేరుకుని జయరాం మృతికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఉపసర్పంచు ఈదన్న, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్మిక విభాగం అధ్యక్షుడు బోయ వెంకటేష్, నాయకులు జయరాముడు, ఫరీఫ్, ఖాదిరి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయురాలికి సన్మానం



చంద్రికను సత్కరిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

కోడుమూరు రూరల్ : స్థానిక బీసీ కాలనీకి చెందిన చేనేత దంపతులు మాచర్ల రాఘవేంద్ర, సుశీలమ్మల రెండవ కుమార్తె చంద్రిక డీఎస్సీ ఫలితాల్లో 82.4మార్కులతో టీచర్ పోస్టు సాధించడం పట్ల చేనేత కార్మిక సంఘం నాయకులు బుధవారం పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామార్తి రాజు మాట్లాడుతూ చేనేత కుటుంబంలో పుట్టిన చంద్రిక తల్లిదండ్రుల కష్టాన్ని తెలుసుకుని చక్కగా చదువుకుని డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టు సంపాదించడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు లక్ష్మన్న, వీరన్న, శేఖర్, బుడ్డప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ సేవలు చిరస్మరణీయం



అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారిణి కౌసల్య

ఓర్వకల్లు : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని గ్రాంథాలయాధికారి కౌసల్య అన్నారు. బుధవారం మండలంలోని నన్నూరు శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలామ్ 94వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కౌసల్య మాట్లాడుతూ, అబ్దుల్ కలామ్ దేశంలో శాస్త్రవేత్తగాను, రాష్ట్రపతిగా సేవలు అందించి ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు.

నాడు సద్వినియోగం.. నేడు నిరుపయోగం

- మూలనపడిన కియోస్క్ యంత్రాలు
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు
- ప్రజాధనం వృథా



గతంలో కియోస్క్ మిషన్‌లో రైతులు ఎరువులను బుక్ చేసుకుంటున్న దృశ్యం (ఫైల్)

గడివేముల: నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా ఉన్నాయి. రైతులు తమ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నేరుగా వారి గ్రామం నుంచే పొందేందుకు ఈ ఆధునిక యంత్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని ఉపయోగించకపోవడంతో మూలన చేరాయి. దీంతో రైతులకు సేవలు దూరమవ్వడంతో పాటు ప్రజా ధనం వృథా అవుతోంది.

రైతులతో ఎంతో ఉపయోగకరం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడివేముల మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి కియోస్క్‌లను కొనుగోలు చేసింది. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలు, తదితర అవసరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్నివిధాలా అవగాహన కల్పించింది. వాతవరణ సమాచారం. వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించేవారు.

నిర్లక్ష్యపు నీడలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. కేవలం ఎరువులను మాత్రమే బుకింగ్ చేసుకునేందుకు వాడుతున్నారు. మరికొంత మంది ఎరువుల బుకింగ్ కూడా మొబైల్‌లోనే చేసుకుంటున్నారు. దీంతో లక్షలాది



గడివేముల ఏఓ కార్యాలయంలో మూలపెట్టిన కియోస్క్ యంత్రాలు

రూపాయల ప్రజాధనం వృథా అవుతుండగా వినియోగంలోలేని కియోస్క్ డిజిటల్ యంత్రాలు బూజుపట్టే పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన గడివేములలోని రెండు రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు ఏఓ కార్యాలయంలో మూలనపడవేశారు. అదే విధంగా ప్రతి రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌ల పరిస్థితి ఇలాగే ఉంది. గతంలో రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను అందిస్తున్నారు. రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువుల కొనుగోలు చేసుకుంటున్నారు. గత ఏడాదంతా మూల పడవేశారు. దీంతో త్వరలో ఖరీఫ్ సీజన్‌లోనైనా కియోస్క్‌ల సంపూర్ణ వినియోగానికి ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఎరువులు అందించాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు పూర్తి స్థాయిలో కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. రబీ సీజన్‌లోనైనా సాగు చేసిన పంటలకు ఎరువులు అందించేందుకు అధికారులు కృషి చేయాలి. ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేశాం. గత వైఎస్సార్ ప్రభుత్వంలా రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందించాలి. దీంతో రైతులకు ఎంతగానో ఉపయోగ పడతాయి.

–బీఎస్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్, గడిగరేవుల

డిజిటల్ విధానం అమలు చేయాలి



నాడు రైతు భరోసా కేంద్రాలలో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు,పంటల ఉత్పత్తి,మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు తెలియజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులకు ఉపయోగపడే కియోస్క్‌లను మూలనపడేశారు. ఈ ఖరీఫ్ సీజన్ కన్నా వినియోగంలోకి తీసుకోస్తే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. అప్పటిలాగే రైతులకు డిజిటల్ సేవలు అందించాలి.

– నిరంజన్‌రెడ్డి, పెసరవాయి

విభజన హామీలను అమలు చేయాలి



కోడుమూరులో మోదీ గోబ్యాక్ అంటూ నల్లజెండాలతో నిరసన తెల్పుతున్న వామపక్ష నాయకులు



గూడూరులో ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కోడుమూరు రూరల్ : 2014ఎన్నికల్లో రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు గఫూర్‌మియ్యా డిమాండ్ చేశారు. విభజన హామీలు నెరవేర్చకుండా, ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి వస్తున్న నరేంద్రమోదీ గోబ్యాక్ అంటూ వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాలు, ఆవాజ్ కమిటీ నాయకులు బుధవారం కోడుమూరులో నల్లజెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించి గాంధీజీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మియ్యా మాట్లాడుతూ రాష్ట్రానికిచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జిల్లాకు రావడమేమిటని ప్రశ్నించారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంతో పాటు, కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి అవసరాల పరిష్కారానికై పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, సీపీఐ, సీపీఎం నాయకులు రాజు, కామార్తి రాజు, శేషు కుమార్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో

విభజన హామీలు నెరవేర్చకుండా రాష్ట్రానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ గోబ్యాక్ అంటూ వామపక్ష పార్టీల నాయకులు బుధవారం గూడూరులో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా సమితి నాయకులు క్రిష్ణ, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్, నాయకులు శ్రీనివాసులు, రాజు, రాముడు, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమించాలి



ప్రజల నుంచి సంతకాల సేకరిస్తున్న డా.సతీష్



కోటి సంతకాల సేకరణపై నాయకులతో చర్చిస్తున్న ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్

- కోటి సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్ : రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ పేరుతో నాణ్యమైన వైద్యాన్ని, వైద్య విద్యను పేదలకు దక్కకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకమై ఉద్యమించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం గూడూరు మండలంలోని కె.నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను అందించాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో ఏడు కళాశాలలు పూర్తవ్వగా, మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, వీటిని సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ చర్యలను ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి నరసింహారెడ్డి, మండల అధ్యక్షులు రామాంజినేయులు, నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు మైల జ్యోతి, రైతు విభాగం జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి మధుసూదన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నరేష్, నాయకులు ఉమామహేశ్వరరమ్మ, మాజీ ఎంపీటీసీ బజారి, సుందరం, సురేష్, అనీల్, భాస్కర్, శ్రీను, మౌలాలి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఓర్వకల్లు : భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గురువారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఉన్న రాగమయూరీలో చేపట్టిన ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్, జిల్లా కలెక్టర్ సిరితో కలిసి పరిశీలించారు. అక్కడ వాహనాల పార్కింగ్, సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఫర్నీచర్, మైక్ సిస్టమ్, మెబైల్ మరుగు దొడ్లు, లైటింగ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ, వాహనాల పార్కింగ్ వద్ద అనువుగా వుండేలా బారికేడ్లను సర్దుబాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి గణేష్‌కుమార్, గోపాలాపురం ఎమ్మెల్యే వెంకటరాజు, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.



వాహనాల పార్కింగ్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

పార్వతిబాయ్ పోరాటానికి మద్దతు

కర్నూలు(సెంట్రల్): సుగాలి ప్రీతిబాయ్ తల్లి పార్వతిబాయ్ చేపట్టిన పోరాటానికి కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ అనంద్‌బాబు, గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల ఆధ్వర్యంలోని బృందాలు మద్దతు ప్రకటించాయి. బుధవారం కలెక్టరేట్ ఎదుట ప్రధాని అపాయిన్‌మెంట్ కోసం ఆమె చేపట్టిన దీక్షకు వారు మద్దతు తెలిపారు. ఎనిమిదేళ్ల నుంచి కేసును పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే సుగాలి ప్రీతిబాయ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్ జోక్యంతో విద్యార్థికి సర్టిఫికెట్లు

కర్నూలు(సెంట్రల్): కర్నూలుకు చెందిన సయ్యద్ సాహిల్ 2023లో నంద్యాలలోని శాంతిరామ్ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్ఈడీఎస్ కోర్సులో చేరాడు. అతను కోర్సు ప్రారంభం సందర్భంగా నిబంధనల మేరకు రూ.70 వేల ట్యూషన్ ఫీజు, రూ.25 వేల హాస్టల్ ఫీజు కాలేజీకి చెల్లించారు. అయితే తరువాత సంవత్సరం నుంచి ఆయన కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా కాలేజీకి వెళ్లలేదు. ఈ క్రమంలో కాలేజీలో ఉన్న ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం వెళ్లితే మిగతా సంవత్సరాలకు సంబంధించి ఫీజు రూ.2.50 లక్షలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యం చెప్పడంతో బాధితుడు శాశ్వత లోక అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ క్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు ప్రతివాదులకు నోటీసులు ఇచ్చి ఇద్దరిని రాజీ చేయడంతో బాధితుడికి కాలేజీ యాజమాన్యం గురువారం సర్టిఫికెట్లను అందజేసింది.



అంత్యక్రియలకు మృతదేహాన్ని వాగులో నుంచి తీసుకెళ్తున్న దృశ్యం

చచ్చినా చావే..!

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో ఎవరైన మరణిస్తే వారికి అంత్యక్రియలు నిర్వహించాలంటే కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు ప్రాణాలు తెగిస్తేగాని చేయలేరు. గ్రామం సమీపంలోని కానుగల వాగు అవతల హిందూ, ముస్లిం శ్మశాన వాటికలు ఉన్నాయి. దీంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే ఈ వాగు దాటి అంత్యక్రియలు చేయాల్సి ఉంటుంది. బుధవారం గ్రామానికి కెందిన వై. రామక్రిష్టారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహాన్ని వాగులో ప్రవహిస్తున్న నీటిని దాటుకొని శ్మశానికి చేరుకొని అంత్యక్రియలు చేశారు. ఇలా కొన్నేళ్లగా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వాగులో ఏ మాత్రం నీటి ఉధృతి పెరిగినా.. హైవే దాటుకొని మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి శ్మశాన వాటికకు చేరుకోవాల్సి ఉంటుంది. వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే కష్టాలు తప్పుతాయని గ్రామస్తులు కోరుతున్నారు.

మత్తు మందు.. గమ్మత్తు

- నొప్పి తెలియకుండా ఆపరేషన్లు
- పెయిన్ క్లినిక్‌లకు పెరుగుతున్న ఆదరణ
- పెద్దాసుపత్రిలో పెయిన్‌లెస్ లేబర్, పెయిన్ క్లినిక్‌లు ఏర్పాటు
- ఏటా 30 వేలకు పైగా శస్త్రచికిత్సలు
- నేడు ప్రపంచ అనెస్తీషియా దినం

కర్నూలు(హాస్పిటల్): శరీరంపై ఏదైనా చిన్నదెబ్బ తగిలినా, కింద పడి గీసుకుపోయినా నొప్పితో అల్లాడిపోతాం. అయితే శరీరాన్ని నిలువునా కోసి ఆపరేషన్ చేసినా ఎలాంటి నొప్పి ఉండదు. ఎందుకంటే ఆపరేషన్‌కు ముందు వేసే ఇంజెక్షన్ మహిమ అది. దీనినే వైద్య పరిభాషలో అనెస్తీషియా ఇంజెక్షన్ అంటారు. అవసరాన్ని బట్టి తగిన డోసులో ఇచ్చే ఈ మత్తు మందు వల్ల ఆపరేషన్ సమయంలో ఎలాంటి నొప్పి తెలియకుండా చేస్తుంది. దీని వల్ల ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించేందుకు వీలుకలుగుతుంది. ఈ నెల 16న ప్రపంచ అనెస్తీషియా దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసెచ్యూసెట్ ఆసుపత్రిలో విలియం థామస్ గ్రీన్ మోర్టన్ అనే వైద్యుడు 1846 అక్టోబర్ 16న 'డై ఇథైల్ ఈథర్' అనే త్వరగా ఆవిరయ్యే రసాయన ద్రవంతో 'గిల్‌బర్ట్ అబట్' అనే వ్యక్తి మెడలోని కణితిని నొప్పిలేకుండా, అతనికి ఎలాంటి ఇబ్బంది, ప్రాణాపాయం కలగకుండా తీయడంలో విజయవంతం అయ్యాడు. అప్పటి నుంచి ఆ ఆపరేషన్ చేసిన రోజును అనెస్తీషియా దినంగా నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనెస్తీషియా విభాగంలో మూడు యూనిట్లు ఉన్నాయి. ఇందులో ముగ్గురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తుండగా 39 మంది పీజీలు చదువుతూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ విభాగం ఆధ్వర్యంలో ఆసుపత్రిలో 24 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. వీటిలో ఏటా అన్ని రకాల శస్త్రచికిత్సలు నిర్వహించే విభాగాలు 30 వేలకు పైగా ఆపరేషన్లు చేస్తున్నాయి. దీంతో పాటు జిల్లా మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 170 మందికి పైగా మత్తు మందు వైద్యులు ఉన్నారు. వీరు ఆపరేషన్‌కు ముందు రోగికి నొప్పి తెలియకుండా మత్తు ఇంజెక్షన్ ఇస్తారు. ఆ తర్వాత ఆపరేషన్ సమయంలో, అనంతరం రోగి కోలుకునేంత వరకు దగ్గరుండి పరిరక్షిస్తూ వైద్య సేవలు అందిస్తారు.



ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు



నడుముకు మత్తు ఇంజెక్షన్ ఇస్తున్న దృశ్యం

ఐసీయూలో వీరిదే కీలక పాత్ర

కేవలం ఆపరేషన్ సమయంలో రోగికి మత్తు మందు ఇవ్వడం మాత్రమే అనెస్తీషియా పాత్ర కాదు. క్రిటికల్ కేర్ విభాగం (ఐసీయూ)లోనూ వీరు కీలకంగా వ్యవహరిస్తారు. రోగి ఆహారం తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు ప్రత్యేక పద్ధతిలో శరీరానికి అవసరమైన శక్తి అందేలా ఏర్పాట్లు చేస్తారు. రోగికి మత్తు మందు ఇవ్వడమే గాక అత్యవసర చికిత్సలో ప్రాణాలను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తారు.

పెయిన్ క్లినిక్‌లకు ఆదరణ

ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా పెయిన్ క్లినిక్‌లకు సంబంధించిన ప్రకటనలు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో వివిధ రకాల నొప్పులు తగ్గిస్తామంటూ పలువురు అనెస్తెటిస్టులు పెయిన్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో దీర్ఘకాల నొప్పులకు ఆధునిక పరికరాలు (ఎక్స్‌రే మిషన్, సీటీ స్కానింగ్ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ మిషన్)ను ఉపయోగించి కుట్లు లేని ప్రత్యేకమైన ఇంజెక్షన్ల ద్వారా నొప్పి తగ్గిస్తారు. నడుము, మోకాళ్లు, మెడ, తల, క్యాన్సర్ నొప్పులకు చికిత్స చేసి నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తారు. ఇప్పుడు చాలా ప్రసవాలను నొప్పులు లేకుండా చేస్తున్నారు. దీనినే పెయిన్‌లెస్ లేబర్‌గా పిలుస్తున్నారు. ఇలాంటి విధానాన్ని ఇటీవల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో ప్రారంభించారు. అలాగే స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పెయిన్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు.


నొప్పులు లేకుండా ప్రసవాలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏటా 30 వేలకు పైగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. వీటిలో 20 వేలు మేజర్, 10 వేలు మైనర్ ఆపరేషన్లు ఉంటాయి. ఇటీవల అనెస్తీషియా విభాగం ఆధ్వర్యంలో ప్రసూతి విభాగంలో పెయిన్‌లెస్ లేబర్ (నొప్పులు లేకుండా ప్రసవాలు), క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పెయిన్ క్లినిక్‌లను ప్రారంభించాం. ఉచితంగా లభించే ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రామశివనాయక్, ప్రొఫెసర్, అనెస్తీషియా విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఆపరేషన్ సమయంలో కీలకం



అనెస్తెటిస్ట్ లేకుండా ఆపరేషన్ అనేది ఊహకందదు. ఒక రోగికి ఏదైనా ఆపరేషన్ చేయాలంటే ముందుగా అనెస్తెటిస్ట్ వచ్చిన ఆ రోగిని పరిశీలించి ఫిట్‌గా ఉన్నాడని సర్టిఫై చేయాలి. ఆ తర్వాతే ఆపరేషన్ చేయడానికి ఏర్పాట్లు చేస్తాం. రోగికి మత్తు మందు ఇచ్చే సమయం నుంచి కోలుకునేంత వరకు అనెస్తెటిస్ట్ వైద్యులు అందించే పాత్ర చాలా ముఖ్యమైనది. అనెస్తీషియా ఇచ్చిన తర్వాత అపస్మారక/అచేతన స్థితిలో ఉన్న రోగికి సులభంగా, విజయవంతంగా ఆపరేషన్ చేయగలుగుతున్నాం.

– డాక్టర్ ఏ.ఎస్.భార్గవ వ్యాస్, జనరల్ సర్జన్, కర్నూలు